

వివరాలు మెయిన్‌లో

**బెల్టు షాపుల్లో మైనర్లకు మద్యం విక్రయించకుండా చర్యలు**


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
### నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

బుధవారం | 16 సెప్టెంబరు , 2026 | పేజీలు : 6


## గ్రామీణ నిరుద్యోగానికి పరిశ్రమలు,యువత

# అనుసంధానమే పరిష్కారం

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**19న కోదాడలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా ఏర్పాట్లపై సన్నాహక సమావేశం**

**జాబ్‌మేళా ద్వారా 3500 మందికి పైగా యువతకు ఉద్యోగాలు**

**గత ఏడాది హుజూర్‌నగర్‌లో నిర్వహించిన జాబ్‌మేళాలో 200కు పైగా కంపెనీలు**




వివరాలు మెయిన్‌లో

# విద్యార్థుల ఏకరూప దుస్తులు నాసిరకం

**ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల పట్ల చిత్తశుద్ధిలేని ప్రభుత్వాలు**

**ఏమీ తెలియనట్టు వ్యవహరిస్తున్న అధికారులు**



**ప్రజాపక్షం/నడిగూడెం:** ప్రభుత్వ పాఠశాలలో పంపిణీ చేసే ఏకరూప దుస్తులు గతంలో కంటే నాణ్యత పెంచి బాలురకు లేత నీలిరంగులో చొక్కా ముదురు నీలం రంగులో ప్యాంట్లు, బాలికలకు లేత నీలం రంగులో టాప్‌లు ముదురు నీలం రంగులో పంజాబిడ్రస్ ప్యాంట్లు, స్కట్స్ ఫ్రాక్ లు అందజేస్తున్నారు. ప్రభుత్వం అందజేసే నాసిరకంగా ఉండటం విద్యార్థుల ప్రధాన సమస్యగా మారిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దుస్తులు నాణ్యత లేకపోవడం సరిగా కుట్టు నిలవకపోవడం దుస్తులు చినిగిపోవడానికి ప్రధాన కారణం అని తెలిపారు. దుస్తులు గరుకుగా ఉండటం రోజంతా వేసుకుని ఉండటం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. అధికారులు విద్యార్థుల యూనిఫామ్‌లు కాంట్రాక్ట్ కు ఇవ్వడం వారు సరిగా నాణ్యత పాటించకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం దీనికి ప్రధాన కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. పలుచటి బట్ట, నాణ్యతలేని దుస్తులు వల్ల విద్యార్థినులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని తల్లిదండ్రులు తెలిపారు. పాఠశాలలో యూనిఫామ్స్ పంపిణీ చేసిన అవి నాసిరకంగా ఉండటంతో మళ్లీ కొత్త వాటిని కొనాల్సి వస్తుందని వాపోయారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి, మెరుగైన విద్య అందిస్తామని పట్టించుకోకపోవడం ప్రభుత్వాలకు విద్యార్థుల పట్ల చిత్తశుద్ధిలేమి కనిపిస్తుందని అన్నారు. మండలంలో 27 ప్రాథమిక పాఠశాలలు, మూడు పాఠశాలలు మూతపడి, 24 పాఠశాలలు నడుస్తున్నాయని, 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఒకటి మూతపడి 8 పాఠశాలలు నడుస్తున్నాయని ప్రభుత్వాలు అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఈ దుస్థితి వస్తుందని అన్నారు. ఇదిలా ఉంటే రేవంత్‌రెడ్డి ప్రజాపాలన ప్రభుత్వంలో విద్యార్థులకు ఆత్మవిశ్వాసం యూనిఫామ్‌లో రంగుల మార్పు చేశామని ప్రతి విద్యార్థికి యంగ్ ఇండియా స్టూడెంట్ కిడ్స్ పేరుతో ఒక్కొక్క విద్యార్థికి రెండు జతల యూనిఫాంలు, షూ, సాక్స్ అవసరమైన సామాగ్రిని అందిస్తున్నట్లు తెలిపారు. అయితే అమలులో మాత్రం ఒక్క యూనిఫామ్ తప్ప విద్యార్థులకు అందించిన దాఖలాలు కన్పించట్లేదు. అధికారులు సైతం విద్యార్థులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన రెండు జతల యూనిఫామ్‌లు, షూ, సాక్స్ లు ఇతర సామాగ్రిని గురించి కాంట్రాక్ట్ దారులను ప్రశ్నించే వారే లేరని తల్లిదండ్రులు తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక పాఠశాలలో 517 మంది, జిల్లా పరిషత్ పాఠశాలలో 457 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. గతంలో మండల వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో సుమారు 3000 మంది విద్యను అభ్యసించే వారని ప్రస్తుతం రానురాను విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల పనితీరు పట్ల తల్లిదండ్రుల ఆలోచన ధోరణిమారటం ఇదోక కారణంగా తెలుస్తోంది.

**ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తాం**
**మండల విద్యాధికారి వనం సత్యనారాయణ**

స్కూల్ యూనిఫామ్ నాణ్యత విషయంలో పాఠశాలకు పంపించిన యూనిఫామ్ క్లాత్ షర్టింగ్ క్లాత్ కొంచెం నాసిరకంగా ఉన్నదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయుల దృష్టికి తీసుకవచ్చారని, నాకు ఈ విషయం చెప్పగా నాసిరకంపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని మండల విద్యాధికారి తెలిపారు.



## పోరాట యోధుల త్యాగం మరువలేనిది

**సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు**

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల త్యాగం మరువలేనిదని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట 78వ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం మండలంలోని వెంపటి, అన్నారం గ్రామాల్లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు దాయం రాజారెడ్డి, దొంగరి ముత్తిలింగం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పేదల హక్కుల కోసం, నైజాం రాచరిక వ్యవస్థ నిర్మూలన కోసం, గ్రామీణ భూస్వామ్య దొరల దౌర్జన్యాల అంతం కోసం జరిగిన మహత్తర సాయుధ రైతాంగ పోరాటంలో వీరి త్యాగాలు మరువలేనివన్నారు. 78వ వార్షికోత్సవాలను గ్రామ గ్రామాన జరుపుకోవాలని, ఆనాటి పోరాట యోధులను స్మరించుకుంటూ జిల్లాలోని గ్రామాల్లో ఉన్న అమరవీరుల స్థూపాల వద్ద శ్రద్ధాంజలి ఘటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దాయం రాజిరెడ్డి మనవరాలు దాయం ఝాన్సీ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లెంల యాదగిరి, బూర వెంకటేశ్వర్లు, ఏఐటియుసి రాష్ట్ర నాయకురాలు నందూరి కరుణ కుమారి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజారాం, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎడెల్లి శ్రీకాంత్, వెంపటి గ్రామ సర్పంచ్ తప్పెట్ల ఎల్లయ్య, సిపిఐ మండల కార్యదర్శి పాల్వాయి పున్నయ్య పాల్గొన్నారు.

## పోరాటాల పురిటిగడ్డ పలివెల

**ప్రజాపక్షం/మునుగోడు:** తెలంగాణ సాయుధ పోరాటంలో పలివెల గ్రామం పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిందని,పోరాటాలకు పురిటిగడ్డగా పలివెల పేరుగాంచిందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురిజ రామచంద్రం అన్నారు.సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని పలివెల గ్రామంలో సాయుధ పోరాట అమరవీరుల స్థూపాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూమి కోసం,భుక్తి కోసం ఆనాడు దొరలకు,జాగీర్దార్లకు,భూస్వాములకు,పటేల్ పట్వారీ వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటమని,ఈపోరాటంలో కొండవీటి గురునాథ రెడ్డి,బుచ్చిరెడ్డి,జగన్మోహన్ రెడ్డి, గోస్కొండ పెద్దలు అమరులయ్యారని గుర్తు చేశారు.నాటి నుండి నేటి వరకు పలివెల కమ్యూనిస్టు పార్టీలకు బలమైన కేంద్రంగా ఉందన్నారు.మాజీ జెడ్పీటీసీ గోసుకొండ లింగయ్య అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొలుగూరి నర్సింహ,ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తిరుపతి వెంకటేశ్వర్లు,సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను,జిల్లా కౌన్సిల్ సభ్యులు బొమ్మరబోయిన లాలయ్య,సురిగి చలపతి, చల్మెడ సర్పంచ్ బండమీది యాదయ్య,మహిళా సమైక్య నాయకురాలు మాదగోని సత్తమ్మ, దుబ్బ వెంకన్న,వనం వెంకన్న,శాఖ కార్యదర్శి ఆనగంటి నర్సింహ, గోస్కొండ మల్లేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.





## ఆపదలో సిఎంఆర్ఎఫ్ అండ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన 256 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.1 కోటి 30 లక్షల 50 వేల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## చెక్కు అందజేత



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మరిపడిగ గ్రామానికి చెందిన ఇంద్రాల నరసింహాకు మంగళవారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య చొరవతో సిఎం సహాయనిధి ద్వారా రూ. 1,57,500ల చెక్కును బాధితునికి సర్పంచ్ గూడెపు కుమార్ ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ 1000 రోజుల ప్రజా పాలనలో ప్రతి ఒక్క పేదకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల పక్షం అని అన్నారు. ఈకార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు నరసింహా, ఇందిరమ్మ కమిటి సభ్యులు లక్ష్మీనారాయణ, వార్డు సభ్యులు సోమయ్య, ఉప్పలయ్య, రామ్మూర్తి పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

**ప్రజాపక్షం/నలగొండ టౌన్** : గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలో దిహిందూ సేవియర్స్ యూత్ ఫౌండర్ అండ్ బీఆర్ఎస్ టౌన్ యూత్ ప్రెసిడెంట్ అనిల్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహానికి నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో,ప్రజలందరూ ఐకమత్యంతో నిర్వహించుకోవాలని కోరారు.గణనాధుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు సింగం రామ్మోహన్,సింగం లక్ష్మి,చిర్ర పంకజ్ యాదవ్,టౌన్ ప్రెసిడెంట్ భోనగిరి దేవేందర్,కార్పొరేటర్లు దీప్లా నాయక్,పెరిక యాదయ్య,పెరిక అశోక్ పాల్గొన్నారు.



# ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్న ప్రజా ప్రభుత్వం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. మంగళవారం మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పాలన కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు కావాలనే అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు.రాష్ట్ర ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, ప్రతిపక్షాల ప్రచారాన్ని నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. గత పదేళ్ల పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలు బయటపడతాయనే భయంతోనే విపక్షాలు అసెంబ్లీ సమావేశాలను విస్మరిస్తున్నాయని విమర్శించారు. మాక్ అసెంబ్లీల పేరుతో చట్టసభల వ్యవస్థను అపహాస్యం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని తెలిపారు.వినాయక చవితి సందర్భంగా నియోజకవర్గంలోని ప్రతి గణేష్ మండపానికి బిఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో రూ.5,016 ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాతీయ మహాసభలే రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలకు వేదిక




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైతు వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు రూపొందించేందుకు నల్గొండలో జరిగే జాతీయ మహాసభలే వేదిక కానున్నాయని రైతు సంఘం జాతీయ నాయకులు జూలకంటి రంగారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని గూడూరు గ్రామంలో రైతులను కలిసి నవంబర్ 15 నుండి 18 వరకు జిల్లా కేంద్రంలో నిర్వహించే రైతు సంఘం జాతీయ మహాసభల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుల విధానాల వల్ల కష్టాల్లో ఉన్న రైతాంగాన్ని ఆదుకునేందుకు ఈ సభలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. మహాసభలకు సర్వత్రా విశేష స్పందన లభిస్తోందన్నారు.ఈ మహాసభలకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో రైతు ప్రతినిధులు, జాతీయ నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రవి నాయక్, పట్టణ కార్యదర్శి మల్లు గౌతమ్ రెడ్డి, గ్రామానికి చెందిన రైతులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ కళాకారులకు తక్షణమే ఉద్యోగాలు కల్పించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ ఉద్యమ కళాకారులపై కాంగ్రెస్ ప్రభుత్వం కపట ప్రేమ చూపుతోందని ఉద్యమ కళాకారుల ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నకిరేకంటి కిరణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు పందిరి సైదులు విమర్శించారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వం ఉద్యమ కళాకారులకు తీవ్ర అన్యాయం చేసిందని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తప్పకుండా ఉద్యోగాలు కల్పిస్తామని నాడు ప్రచారంలో రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లోనే తీర్మానం చేసి ఉద్యమ కళాకారులందరికీ ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర కమిటీ నాయకులు అనోజ్ వెంకన్న, దరువు అంజన్న, నకిరేకంటి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కలకొండ శ్రీనివాస్, జిల్లా గౌరవ సలహాదారులు అంకెపాక కోటేష్, కందుకూరి సుదర్శన్, దారం మల్లేష్ యాదవ్, నియోజకవర్గ ఇన్చార్జి రెమడాల శ్రీనివాస్, నాయకులు నకిరేకంటి వేణు, మేదరి కిరణ్, ఆదిమళ్ల యల్లయ్య, సిరిసనవాడ సత్యనారాయణ, కంచి శ్రీనివాస్, సైదులు పాల్గొన్నారు.

# ఆరు ఎకరాల స్థలం కేటాయించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పెరుగుతున్న జనాభా, కేసుల సంఖ్యకు అనుగుణంగా నూతన కోర్టు భవనాల నిర్మాణానికి ఆరు ఎకరాల స్థలం కేటాయించాలని బార్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ఎమ్మెల్సీ, సీనియర్ న్యాయవాది ఎంసీ కోటిరెడ్డిని కలసి తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు వెంకటేశ్వర్లు మాట్లాడారు. పట్టణంలో జనాభా పెరగడంతో పాటు న్యాయపరమైన వివాదాలు, కేసుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతుండటంతో ప్రస్తుతం ఉన్న భవనం భవిష్యత్ అవసరాలకు సరిపోవడం లేదని చెప్పారు. అన్ని రకాల కోర్టులను ఒకే భవన సముదాయంలోకి తీసుకువచ్చేలా నూతన భవనాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. స్థల కేటాయింపుపై స్థానిక అధికారులతో మాట్లాడి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ లభించినట్లు తెలిపారు. న్యాయవాదులు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల కొరతను పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నట్లు పేర్కొన్నారు. కోర్టు కాంప్లెక్స్ నిర్మాణంతో అర్జీదారులకు, న్యాయవాదులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఈసరం కరుణాకర్, ప్రధాన కార్యదర్శి జంగిలి ఎల్లయ్య, జాయింట్ సెక్రటరీ రాయారపు భాస్కర్, కోశాధికారి రెడ్డిపల్లి సైదులు, పెండ్యాల నరసింహారావు, పి.పి రఘురామారావు, ఏజీపీ మిట్టపల్లి శ్రీధర్ పాల్గొన్నారు.



## మిల్లర్లపై అధికారుల వేధింపులు అపాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** రైస్ మిల్లర్లపై అధికారులు వేధింపులు ఆపాలని దేవరకొండ, కొండమల్లేపల్లి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు సముద్రాల వెంకన్న ప్రభుత్వాన్ని కోరారు. రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సిఎంఆర్ సేకరణలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రైస్ మిల్లర్ల అసోసియేషన్ పిలుపు మేరకు వారు మంగళవారం మిల్లులను బంద్ చేసి సమ్మె చేస్తున్న కాలనికి విద్యుత్ చార్జీలను పూర్తిగా మినహాయించాలని కోరతూ విద్యుత్ డిఈ బాల్యానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. తప్పు చేయని మిల్లర్ల విషయంలో కూడా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడం బాధాకరం అని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్న రైస్ మిల్లుల యాజమానులపై విజిలెన్స్ తదితర అధికారుల వేధింపులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో రైస్ మిల్లర్ల సంఘం సభ్యులు కేసాని లింగారెడ్డి, శీల శ్రీనివాసులు, రాఘవేందర్, కండె రామకృష్ణ, గోవిందు జగతయ్య, శీల కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, బూర్గు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్, కళ్యాణ్‌చక్రవర్తి తదితరులు ఉన్నారు.

## సృజనాత్మకతను వెలికి తీసేందుకు హ్యాకథాన్ దోహదం




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు హ్యాకథాన్ లాంటి కార్యక్రమాలు దోహదపడతాయని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి అన్నారు.ఎంజీయూ ఇంజనీరింగ్ కళాశాల వేదికగా మంగళవారం అంతర్గత హ్యాకథాన్‌ను ఆయన ప్రారంభించారు. జాతీయ ఇంజనీరింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఘన నివాళులు అర్పించి, జాతి నిర్మాణంలో ఇంజనీర్ల సేవను కొనియాడారు.దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మక పరిశోధన సంస్థలు ఇచ్చిన అంశాలపై విద్యార్థులు రూపొందించిన 40 నమూనాలను ప్రదర్శించారు. వైర్‌లెస్ చార్జింగ్ పరికరం, రైతు ఉత్పత్తుల సేకరణకు సాఫ్ట్‌వేర్, భారీ కార్గోల్లో కృత్రిమ మేధ,గ్రామీణ మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లో నీటి శుద్ధి,సోలార్ స్మార్ట్ డ్రైయర్ వ్యవస్థ వంటి నమూనాలను విద్యార్థులు వివరించారు.బీహెచ్‌ఈఎల్ శాస్త్రవేత్త బి.సత్యనారాయణ,టీసీఎస్ సాఫ్ట్‌వేర్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆర్.రాఘవేంద్రలతో కలిసి నమూనాలను పరిశీలించారు.కార్యక్రమంలో డీన్ ఆచార్య రేఖ,డాక్టర్ జయంతి,డాక్టర్ సంధ్యారాణి,సీఎస్‌సి,ఈసీ,ట్రిపుల్ ఈ విభాగాల అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా కళా జాతర జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** యాభై రెండేళ్ళ అరుణోదయలో యాభై ఏళ్ళ విమలక్క ప్రస్థానం 50 గంటల పాటు ఏకదాటిగా పాట ఆట మాటలతో సాగే ప్రజా కళా జాతరను జయప్రదం చేయాలని రైతు కూలీ సంఘం నాయకులు బోడ బాలస్వామి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ నందు రైతు కూలీ సంఘం, ప్రజా కళా జాతర ఆహ్వాన సంఘం కమిటి ఆధ్వర్యంలో ప్రజా కళా జాతర కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 26, 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లోని ఆర్‌టిసి కళ్యాణ మండపం, బాగ్‌లింగంపల్లి యందు జరుగు జాతరను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లి నాగరాజు, నవిలి ఉపేందర్, బత్తుల గురువయ్య, కొరివి వీరన్న, దాసరి సురేష్, రాములు, సతీష్, మధుకర్ పాల్గొన్నారు.



## సెప్టెంబర్ 17న ముగింపు సభకు తరలిరావాలి

**ప్రజాపక్షం/గుండాల;** సిపిఐ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సెప్టెంబర్ 17న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగే రైతాంగ సాయుధ పోరాటాల ముగింపు సభకు గుండాల మండలం నుండి సిపిఐ పార్టీ శ్రేణులు ఎర్ర చొక్కాలను ధరించి ముగింపు సభకు తరలిరావాలని సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య పిలుపునిచ్చారు. ముందుగా భారీ బైక్ ర్యాలీతో మండల పరిధిలోని సుద్దాల, అనంతారం, వెల్మజాల, మరిపడిగ, తుర్కల షాపురం గ్రామాలలోని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల యోధులకు ఘనంగా నివాళులర్పించనున్నట్లు తెలిపారు.

## 17న గిరిజన గ్రామాల్లో పాలాభిషేకం చేయాలి



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ చిత్రపటానికి ఈనెల 17న గిరిజన గ్రామాల్లో పాలాభిషేకం చేయాలని తుంగతుర్తి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తాటికొండ సీతయ్య పిలుపునిచ్చారు. మంగళవారం తుంగతుర్తి పార్టీ కార్యాలయంలో గిరిజన నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో గిరిజనులకు న్యాయం చేసే విధంగా మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ 6 శాతం ఉన్న రిజర్వేషన్ 10 శాతానికి పెంచి వారి కుటుంబాల్లో వెలుగులు నింపారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండగాని రాములు గౌడ్, గుగులోతు కాలరామ్ నాయక్, వీరోజీ నాయక్, యాకు నాయక్, పూన్య నాయక్ పాల్గొన్నారు.

## ఓటర్ల నమోదు జాబితా పరిశీలన

**ప్రజాపక్షం/నాంపల్లి :** మండలంలోని గానుగుపల్లి,నరసింహులగూడెం గ్రామలాలోని 281,282, పోలింగ్ బూత్ సెంటర్‌లలో అనుమానాస్పద ఓటర్ల నమోదుపై అధికారులు దృష్టి పెట్టి పరిశీలించారు.ఓటర్లకు జారీ చేసిన నోటీసులు,అందుకు సంబంధించిన వివరాలను మంగళవారం నాంపల్లి తహసీల్దార్ అంబటి ఆంజనేయులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.జాబితాలో ఒకే పేరు పునరావృతం కాకుండా పలు వివరాలను తనిఖీ చేశారు.అర్హులైన ప్రతి ఒక్కరు పేరు ఓటర్ జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.ఈకార్యక్రమంలో సర్పంచ్,ఉప సర్పంచ్,అధికారులు బిఎల్ఓ తదితరులు పాల్గొన్నారు.



## గత జాబ్‌మేళాపై శ్వేతపత్రం విడుదల చేయాలి

### మంత్రి ఉత్తమ్ నిర్వహిస్తున్న జాబ్‌మేళాపై మాజీ ఎమ్మెల్యే విమర్శలు



**ప్రజాపక్షం/కోదాడ:** కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను, వారి వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే 19న జాబ్‌మేళా అని నాటకానికి తెరతీశారని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ తీవ్రంగా విమర్శించారు. కోదాడలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తీరుపై కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై ధ్వజమెత్తారు. జాబ్ మేళాలకు తాము వ్యతిరేకం కాదని, అయితే ఆ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రాజకీయమోసాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని ఆయన అన్నారు. నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వకుండా ప్రైవేట్ ఉద్యోగాల పేరుతో యువతను మభ్యపెట్టడానికి ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. కేవలం సిమ్‌కార్ల విక్రయం, సూపర్‌మార్కెట్లు, పెట్రోల్ బంకులు, సిమెంట్ ఫ్యాక్టరీలలో రోజువారి కూలీ ఉద్యోగాలు చూపిస్తూ యువతను మోసం చేస్తున్నారని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా, ఎంపిగా ఇప్పుడు మంత్రిగా కొనసాగుతున్న ఉత్తమ్‌కుమార్ రెడ్డి హుజూర్‌నగర్ నియోజకవర్గంలో సిమెంట్ పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగ యువతకు ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు ఇప్పించారో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ జాబ్‌మేళా నాటకాలను యువత, నిరుద్యోగులు గమనించాలని, వారి మాయ మాటలకు మోసపోవద్దని మల్లయ్యయాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో షేక్ నయీం, భూపాల్ రెడ్డి, చీమ నరేష్, ఉపేందర్, పైడిమర్రి సత్యబాబు, అనంతుల ఆంజనేయులు, పొట్ట కిరణ్‌కుమార్, పిట్టల భాగ్యమ్మ, కొదాటి కృష్ణయ్య, హనుమానాయక్, వీరయ్య, బత్తుల ఉపేందర్ పాల్గొన్నారు.

## తక్షణమే భూ సమస్యను పరిష్కరించాలని వినతి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** చింతలపాలెం మండలం వజినేపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 52 భూములకు సంబంధించిన సమస్యను తక్షణమే పరిష్కరించి పట్టాదారులకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా జాయింట్ కలెక్టర్ బి. హరిసింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున్ రెడ్డి మాట్లాడుతూ వజినేపల్లి, నెమలిపురి గ్రామాల మధ్య భూముల సరిహద్దు వివాదం కారణంగా సర్వే నంబర్ 52లో పట్టాలు పొందిన రైతులు అనేక సంవత్సరాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రెవెన్యూ అటవీ శాఖల మధ్య నెలకొన్న వివాదాన్ని రైతులపై మోపడం సరికాదన్నారు. గతంలో ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన భూములను సాగు చేసుకుంటున్న రైతులకు నూతన పట్టాదారు పాస్‌బుక్కులు, భూ రికార్డుల నమోదులో సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. రైతులు ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా జాయింట్ కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి, క్షేత్రస్థాయిలో సర్వే చేయించి సర్వే నంబరం 52 భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నెమలిపురి, వజినేపల్లి గ్రామ రైతులు కొండవీటి విజయకుమార్, ముకుంద, రమేష్‌బాబు, వీరమల్ల కిషోర్, స్వామి, తులసి, వెంకటేశ్వరరావు, ధరావత్ కోమటి పాల్గొన్నారు.

## 50 ఏళ్ల విమలక్క కళా ప్రస్థానం -కళా జాతర

**ప్రజాపక్షం/నకిరేకల్ :** 52 ఏళ్ల అరుణోదయ,50 ఏళ్ల విమలక్క ప్రస్థానాన్ని పురస్కరించుకుని 50 గంటల పాటు ఏకధాటిగా సాగే ప్రజా కళా జాతర కరపత్రాన్ని మంగళవారం నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో రైతుకూలీ సంఘం,ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.ఈసందర్భంగా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బొమ్మకంటి కొమురయ్య,రాష్ట్ర నాయకులు గొండ్యాల సైదులు మాట్లాడుతూ ఈ నెల 26, 27, 28 తేదీలలో హైదరాబాద్ బాగ్ లింగంపల్లి లోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో 50 గంటల జాతర జరుగుతుందన్నారు. విమలక్క ఒక వ్యక్తి కాదు.సామూహిక శక్తి అని, బహుజన బతుకమ్మను తలకెత్తుకుని తెలంగాణ అంతటా తిరిగిన ఆమె పోరాట స్ఫూర్తితో ఈజాతర నిర్వహిస్తున్నామని తెలిపారు. అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో బంటు రామలింగయ్య,మల్లేష్,లింగారెడ్డి,నారాయణరెడ్డి,సోమన్న,బాలస్వామి, మామిడి యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాభివృద్ధిపై ప్రణాళికతో ముందుకు సాగాలి

**ప్రజాపక్షం/మర్రిగూడ :** గ్రామాభివృద్ధి పనులను ముందుగానే గుర్తించి ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఎంపీడీవో మునయ్య సూచించారు.మండలంలోని తిరుగండ్లపల్లి గ్రామంలో మంగళవారం వికసిత్ భారత్‌జీరామ్ జీ,విజీపీపీపై గ్రామ సభ నిర్వహించారు.సర్పంచ్ లక్ష్మమ్మ జంగయ్య గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో మునయ్య పాల్గొని మాట్లాడారు.గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గ్రామసభలో చర్చించి ప్రాధాన్యతా క్రమంలో గుర్తించాలని,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల 60:40 నిధుల భాగస్వామ్యంతో వాటిని అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లు,మురుగు కాలువలు,తాగునీటి సౌకర్యం, ఉపాధి హామీ పనులను అనుసంధానం చేయాలని సూచించారు.కార్యక్రమంలో ఎంపీవో రవికుమార్,ఏపీవో జయరాజ్,ఏపీఎం వెంకట్, వార్డు సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.



## పేదలకు సిఎంఆర్‌ఎఫ్ అండ

**ప్రజాపక్షం/నకిరేకల్ :** పేద,మధ్యతరగతి కుటుంబాలకు ఆపద కాలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంత అండగా నిలుస్తోందని ప్రభుత్వ విప్,స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు.మండలంలోని కడపర్తి గ్రామానికి చెందిన బట్టు నరహరి అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఈవిషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రత్యేక చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.3.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు.మంజూరైన ఆర్థిక సహాయ పత్రాన్ని మంగళవారం నరహరి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు,మాజీ జెడ్‌పిటిసి కోట మల్లికార్జున్,పార్టీ పట్టణ అధ్యక్షుడు లింగాల వెంకన్న,నాయకులు పాటి యాదగిరిరెడ్డి,ఆకుల భాస్కర్, గిలకత్తుల వీరయ్య,వేమవరపు నరసింహులు పాల్గొన్నారు.

## సౌత్ జోన్ పోటీలకు ఎన్‌జి కళాశాల విద్యార్థులు ఎంపిక



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మహాత్మా గాంధీ యూనివర్సిటీ నిర్వహించిన ఇంటర్ కాలేజీ టోర్నమెంట్లలో నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు.బ్యాడ్మింటన్ విభాగంలో మొదటి బహుమతిని గెలుచుకున్న జట్టులో కె.దిలీప్ కుమార్ (బీఏ తృతీయ సంవత్సరం),కె. శివాజీ (బీఏ తృతీ),కె.భార్గవానంద్ (బీఎస్సి తృతీయ),శ్రీకర్ (బయోటెక్నాలజీ ఫైనల్ ఇయర్),మహమ్మద్ మాస్ (బీకాం ప్రథమ సంవత్సరం) ప్రాతినిధ్యం వహించారు.ఈ సందర్భంగా మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫసర్ సముద్రాల ఉపేందర్,ఇన్‌ఛార్జి ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆదె మల్లేశం విద్యార్థులను అభినందించారు.జట్టులో అత్యంత ప్రతిభ కనబరిచిన శ్రీకర్,మహమ్మద్ మాస్ ఇద్దరూ ఎంజీయూ జట్టుకు ఎంపికయ్యారని,త్వరలో కర్ణాటకలోని బళ్లారిలో జరిగే ఇంటర్ యూనివర్సిటీ సౌత్ జోన్ పోటీల్లో పాల్గొననున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు.

## జాతీయ ప్రకృతి వ్యవసాయంలో రైతుల భాగస్వామ్యం కీలకం

**ప్రజాపక్షం/నాంపల్లి :** కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.రసాయన ఎరువులు,పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి,స్థానిక వనరులతో తక్కువ పెట్టుబడితో పర్యావరణహితంగా,స్థిరమైన సాగు చేసే విధానాలను అధికారులు వివరించారు.నేల ఆరోగ్య పరిరక్షణ,జీవ వైవిధ్యం,తేమ సంరక్షణ,సహజ పద్ధతుల్లో చీడపీడల నియంత్రణ,ప్రకృతి వ్యవసాయ ఇన్‌పుట్‌ల తయారీ, వినియోగంపై అవగాహన కల్పించారు.ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు ఖర్చులు తగ్గడంతో పాటు నేల సారం పెరిగి పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని,రైతులు తమ ప్రాంత పరిస్థితులకు అనుగుణంగా క్రమంగాఈ పద్ధతులు అవలంభించాలని సూచించారు.కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బంగారు శివ,నాంపల్లి సర్పంచ్ నక్క చంద్రశేఖర్,ఏఈవోలు,వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.






## పోషకాహార లోప నిర్మూలనే లక్ష్యం

**ప్రజాపక్షం/నకిరేకల్** : పిల్లలు,గర్భిణులు,బాలింతలలో పోషకాహార లోపాన్ని నివారించి వారి ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా జాతీయ పోషణ మాసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ భవాని పేర్కొన్నారు.మంగళవారం మండలంలోని పాలెం గ్రామంలో జాతీయ పోషణ మాసోత్సవాలు నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మన పరిసరాల్లో లభించే ఆకుకూరలు,తాజా కూరగాయలు,తృణధాన్యాలు, సమతుల్యాహారం ప్రాముఖ్యతను వివరించారు.ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని అలవాటు చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు వి.మంగ, సునీత,గర్భిణీలు,బాలింతలు,చిన్నారులు పాల్గొన్నారు.

## బ్యాగ్స్,వాటర్ బాటిల్స్ పంపిణీ



**ప్రజాపక్షం/నకిరేకల్** : మండలంలోని మండలపురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం వాసవి క్లబ్,కపుల్స్ క్లబ్,వనిత క్లబ్ ఆధ్వర్యంలో లక్ష్మీ సాయి జ్యూయలర్స్ యజమాని గుండా గోపి కళ్యాణి సహకారంతో స్కూల్ బ్యాగ్స్,స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ గుండా నరేందర్,చార్టర్ ప్రెసిడెంట్ గుండా గోపికళ్యాణి,అధ్యక్షులు బ్రహ్మదేవర వేణు, కందగట్ల బాలాజీ, ప్రధాన కార్యదర్శి శ్రీకాకోళ్ళ వెంకన్న,ఉపాధ్యక్షులు కందగట్ల పవన్,ఉప్పల శివకృష్ణ,కందగట్ల సంతోష్,ఉపాధ్యాయులు పుట్ట దశరథ పాల్గొన్నారు.

## దీక్ష విరమణ

**ప్రజాపక్షం/నాంపల్లి** : మండలంలోని సుంకిశాల గ్రామంలో4 రోజులుగా కొనసాగుతున్న నిరసన దీక్ష మంగళవారం విరమించారు.పాత ఊరు ఇండ్ల స్థలాల రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని గ్రామస్తులు దీక్ష చేస్తుండగా,స్థానిక తహసీల్దార్ అంబటి ఆంజనేయులు సంఘటన స్థలానికి చేరుకుని గ్రామ ప్రజలతో చర్చించి ఇండ్ల స్థలాలను పరిశీలించారు.ఈవిషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని,శుక్రవారం వరకు సమయం ఇవ్వాలని కోరారు. తహసీల్దార్ హామీతో గ్రామస్తులు దీక్ష విరమించారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాషిపాక రాములు,వార్డు సభ్యులు కలకొండ లక్ష్మయ్య,బుడిగపాక ధనమ్మ,వాడపల్లి లావణ్య,నేరేడుగొమ్ము సత్యనారాయణ,కాటిక ఇదెమ్మ,ఎడమ మల్లేష్, ఆంజనేయులు,దేవేందర్,హరీష్,కిరణ్ పాల్గొన్నారు.



## సెప్టెంబర్ 30లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సన్న రకాల వరి సాగు చేసే రైతులకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున ప్రభుత్వం అందించే బోనస్ పొందడానికి ఈనెల 30వ తేదీలోగా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఋష్యేంద్రమణి సూచించారు. మంగళవారం మండల పరిధిలో వరి బోనస్ నమోదు ప్రక్రియపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గుర్తించిన 7 రకాల వరి విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు, అలాగే సొంత విత్తనాలు, కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ద్వారా పొంది సాగు చేస్తున్న రైతులు కూడా ఈ బోనస్ పథకానికి అర్హులని స్పష్టం చేశారు. అర్హత ఉండి ఇప్పటి వరకు నమోదు చేసుకోని రైతులు వెంటనే సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారులను (ఏఈఓ) సంప్రదించి తమ వివరాలను నమోదు చేయించుకోవాలని కోరారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని రైతులు ఎటువంటి ఆలస్యం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఈఓ పార్వతి, రైతులు శ్రీనివాస్ చారి, సూరోజు పోతునూరి చారి, చిమట రామరాజు, వ్యవసాయ శాఖ సిబ్బంది, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నాయి బ్రాహ్మణులకు సబ్సిడీ కరెంట్ బకాయిలు విడుదల చేయాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** హేర్ సెలూన్ షాపులకు ప్రభుత్వం ప్రకటించిన 250 యూనిట్ల ఉచిత విద్యుత్ సబ్సిడీ బకాయి బిల్లులను తక్షణమే చెల్లించాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని నాయి బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు కోరారు. మంగళవారం పట్టణంలో ఎమ్మెల్యేను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న నాయి బ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రభుత్వం నెలకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ రాయితీని కల్పించిందని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం కటింగ్ షాపులకు ఈ సబ్సిడీ బిల్లులు వర్తించకపోవడంతో వృత్తిదారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తీవ్ర సమస్యపై రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను వేడుకున్నారు. బకాయి పడిన సబ్సిడీ విద్యుత్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేసేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. వినతిపై స్పందించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి అలగడప గిరిధర్, గౌరవ అధ్యక్షుడు వెలిజాల హనుమంతు, నాయకులు జంపాల సత్యనారాయణ, కృష్ణమూర్తి, గోలి యాదగిరి, పట్టణ అధ్యక్షుడు రాయించు నరసింహ, కార్యదర్శి మేడిపల్లి సైదులు, కోశాధికారి వెంకన్నపాల్గొన్నారు.

## 17న తండాల్లో కెసిఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గిరిజనులకు ఆత్మగౌరవం, స్వయం పాలన కల్పించేందుకు తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ నిర్ణయంతో గిరిజనుల చిరకాల ఆకాంక్ష నెరవేరిందని పేర్కొన్నారు. 17న జరిగే ఈ కృతజ్ఞతా కార్యక్రమాల్లో బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, నాయకులు దుర్గంపూడి నారాయణరెడ్డి, చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎండి యూసుఫ్, ధనావత్ చిట్టిబాబు నాయక్, ఆంగోతు హాతిరామ్ నాయక్, చౌగాని భిక్షం గౌడ్, మట్టపల్లి సైదులుయాదవ్, దిరావత్ పాచు నాయక్ పాల్గొన్నారు.

## సర్పంచ్, కార్యదర్శిపై ఎంపిఓకు ఫిర్యాదు



**ప్రజాపక్షం/నడిగూడెం:** మండలంలోని వేణుగోపాలపురం సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిపై వార్డు సభ్యులు మంగళవారం నడిగూడెం ఎంపీవో ఆంజనేయులుకు ఫిర్యాదు చేశారు. గ్రామ సర్పంచ్ వేల్పుల సోమయ్య, పంచాయతీ కార్యదర్శి గోపి లు వార్డు సభ్యులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా ఇద్దరే తీర్మాణాలపై సంతకాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇటీవల గ్రామంలోని అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన తీర్మాణంను వార్డు సభ్యులకు చెప్పకుండా దొంగచాటుగా సర్పంచ్ తీర్మాణం చేయగా అట్టి తీర్మాణంను కార్యదర్శి ఆమోదించారని అన్నారు. గ్రామ పంచాయతీలోని మెజార్టీ వార్డు సభ్యులకు సమాచారం లేకుండా, సంతకాలు లేకుండా కాంట్రాక్టర్ దగ్గర కమిషన్‌ను లోబడి సర్పంచ్, కార్యదర్శి అవినీతికి పాల్పడుతున్నారని అన్నారు. గ్రామంలో పల్లె ప్రకృతి వనంకు కేటాయించిన నీళ్ల బోరును డబ్బులకు అక్రమంగా పక్కన ఉన్న పొలాలకు సర్పంచ్ నీళ్లను మళ్లిస్తున్నాడని దానికి కార్యదర్శి సహకరిస్తున్నారని అరోపించారు. గ్రామ సభలకు వార్డు సభ్యులను ఆహ్వానించకుండా ఏకపక్షంగా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి నిర్ణయాలు తీసుకోవడం పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎంపివోకు ఫిర్యాదు చేసిన వారిలో గ్రామ ఉప సర్పంచ్ సంపతి వీరబాబు, వార్డు సభ్యులు సైదమ్మ, లక్ష్మి , మధుబాబు, వంశీ, అచ్చమ్మ పాల్గొన్నారు.



## నేడు ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకం దరఖాస్తులకు గడువు ముగింపు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ ప్రభుత్వం బీసీ మహిళల కోసం ప్రవేశపెట్టిన ఉచిత ఇందిరమ్మ కుట్టు మిషన్ల పంపిణీ పథకానికి దరఖాస్తు చేసుకునే గడువు ముగిసిందని మున్సిపల్ కమిషనర్ ఎన్. శ్రీజారెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ వివరాలను వెల్లడించారు. ఈ పథకానికి నియోజకవర్గ వ్యాప్తంగా వందలాది మంది మహిళలు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల ద్వారా ఉత్సాహంగా దరఖాస్తులు సమర్పించారని చెప్పారు. 18 సంవత్సరాల నుండి 55 సంవత్సరాల లోపు ఉన్న బీసీ మహిళలు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు.అధికారిక టిజిఒబిఎంఎంఎస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, మీసేవ ద్వారా పొందిన కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు సమర్పించారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ మెప్మా సిబ్బంది, కార్యాలయ అధికారులు, సచివాలయ ప్రాంగణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌లో తప్పుల సవరణ వేగవంతం



**ప్రజాపక్షం/నందికొండ:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా గుర్తించిన తప్పుల సవరణ ప్రక్రియ వేగవంతమైంది. గుర్తించిన తప్పులపై సంబంధిత ఓటర్లకు ఇప్పటికే నోటీసులు జారీ చేసిన అధికారులు,ప్రస్తుతం సవరణలు చేపడుతున్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమ ఆధారాలతో నందికొండ మున్సిపల్ కార్యాలయానికి వస్తున్నారు.మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ ప్రోటోకాల్ అధికారి దండ శ్రీనివాస్ రెడ్డి, బూత్ లెవల్ ఆఫీసర్ల సమక్షంలో ఓటర్ల వివరాలను పరిశీలిస్తున్నారు.పేరు,వయస్సు,చిరునామా తదితర వివరాల్లో ఉన్న పొరపాట్లను ధ్రువీకరణ పత్రాలను చూసి సరిచేస్తున్నారు.అర్హులైన ఓటర్ల వివరాలు ఎలాంటి తప్పులు లేకుండా నమోదయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.ఎస్ఐఆర్‌లో అభ్యంతరాలు,తప్పుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వడంతో మున్సిపల్ కార్యాలయంలో ఓటర్ల తాకిడి కొనసాగుతోంది.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి వి. వినోద్ కుమార్ అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నార్కట్‌పల్లి రైతు వేదికలో మంగళవారం జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత,సూత్రాలు,ప్రకృతి వ్యవసాయ ఇన్‌పుట్‌ల తయారీ,భూసార పరిరక్షణ,సాగు ఖర్చులు తగ్గించుకునే పద్ధతులపై వివరించారు.రసాయన ఎరువులకు బదులు సహజ వనరులను వినియోగించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని,రైతులు దశలవారీగా ప్రకృతి వ్యవసాయాన్ని అలవర్చుకుని మిషన్ లక్ష్యాల సాధనలో భాగస్వాములు కావాలని సూచించారు.కార్యక్రమంలో నకిరేకల్ ఏడీఏ విజయేందర్ రెడ్డి,ప్రజాప్రతినిధులు,ఏఈవో కె. గౌతమ్,రైతులు తదితరులు పాల్గొన్నారు.





## మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మహిళల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణా రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్డు వద్ద కాంగ్రెస్ పార్టీ మైనార్టీ జిల్లా నాయకులు సాజీద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళలకు చీరలను పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై చీరలను పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం, మహిళలకు వడ్డీ లేని రుణాలు వంటి ఎన్నో పథకాలను అమలు చేస్తుందన్నారు.

## నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో భాగంగా ఈనెల 19న కోదాడ పట్టణంలో నిర్వహించే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట పట్టణ సిఐ వెంకటయ్య పిలుపునిచ్చారు. మంగళవారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో మెగా జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి, అవగాహన ఆటోలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ఒకే వేదికపై అనేక కంపెనీలను పరిచయం చేసే అవకాశం ఈ జాబ్‌మేళా ద్వారా లభిస్తుందన్నారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కోల్పోకుండా జాబ్‌మేళాలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సందీప్‌రెడ్డి, కనకరత్నం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా హిందీ భాషా దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/చింతలపాలెం :** జాతీయ హిందీ దివస్ సందర్భంగా హిందీ భాషా దినోత్సవ వేడుకలను మండల కేంద్రంలోని కెజిబివి నందు ఉపాధ్యాయులు, విద్యార్థినులు అత్యంత ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు హిందీ భాషా ప్రాముఖ్యత తెలిపే పాటలు, నృత్యాలు, చిరు నాటికలు, చిత్రలేఖనం ప్రదర్శనలతో అలరించారు. పాఠశాల ప్రత్యేక అధికారి ప్రసన్న, హిందీ ఉపాధ్యాయుని ఆసియా మాట్లాడుతూ జాతీయ భాషగా హిందీ యొక్క ప్రాముఖ్యతను, దేశ ఐక్యతకు హిందీ భాష దోహదపడే తీరును వివరించారు. ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయ బృందం, విద్యార్థినిలు పాల్గొని విజయవంతం చేశారు.




## ఈనెల 17న ప్రతి తండాలో ర్యాలీ...



**ప్రజాపక్షం/దేవరకొండ;** తెలంగాణలో గిరిజన తండాలు, గూడెలకు ప్రత్యేక గ్రామ పంచాయతీ హోదా కల్పించి, గిరిజనులకు స్వపరిపాలనను అందించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అని దేవరకొండ మాజీ ఎంఎల్ఏ రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన దేవరకొండ నియోజకవర్గ ఎస్టి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజనుల రిజర్వేషన్లను 6 శాతం నుండి 10 శాతానికి పెంచిన ఘతన కేసీఆర్‌దే అని, 2018లో కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 4,383కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయగా, సుమారు 3146 తండాలు, గూడెలు స్వతంత్ర గ్రామ పంచాయతీలుగా అప్‌గ్రేడ్ అయ్యాయని తెలిపారు. 500కు పైగా జనాభా కలిగి, అప్పటికే ఉన్న గ్రామ పంచాయతీ కేందరానికి 1.5 కిమీకు పైగా దూరంలో ఉన్న తండాలు, గూడెలు, ఆవాసాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. తండా గ్రామ పంచాయతీగా మారడంతో గిరిజనులకు సొంత సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యాలయం, నిధులు, స్థానిక అభివృద్ధిపై నిర్ణయాధికారం లభించిదన్నారు. 3146 మంది సర్పంచ్‌లు, 24,682 మంది వార్డు సభ్యులు స్థానిక ప్రజా ప్రతినిధులుగా ఏర్పడి గ్రామస్థాయి పరిపాలనలో గిరిజనులకు భాగస్వామ్యం కల్పించారని ఆయన తెలిపారు. తండాలు పెద్ద గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న సమయంలో ఎదురైన పరిపాలనా నిర్లక్ష్యానికి ఇది శాశ్వత పరిష్కారం చూపిన సంస్కరణ అని రవీంద్రకుమార్ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేకంగా ఎస్టి స్పెషల్ డెవలఫ్ మెంట్ ఫండ్‌కు చట్టబద్ధత కల్పించిందని తెలిపారు. 2022/23లో రూ. 13,412.63కోట్లు, 2023/24లో రూ. 15,232.62కోట్లకు నిధులను పెంచినట్లు, గిరిజన రైతులకు సాగుభూముల అభివృద్ధి కోసం గిరి వికాసం పథకం ద్వారా వేలాది మంది రైతులకు ప్రయోజనం కల్పించారని, గిరిజన విద్యార్థుల కోసం నూతనంగా గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, ఐఐటి, నీట్ కోచింగ్ వంటి కార్యక్రమాలను చేపట్టడంతో పాటు గిరిజన యువతకు ఉపాధి అవకాశాల కోసం సిఎం ఎస్టి ఎంటర్‌ప్రినర్‌షిప్, ఇన్నోవేషన్ స్కీం, డ్రైవర్ ఎంప్లాయిమెంట్ స్కిం వంటి కార్యక్రమాలు అమలు చేసినట్లు రవీంద్రకుమార్ వివరించారు. ఈసమావేశంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బీల్యానాయక్, మండల అధ్యక్షులు దస్రునాయక్, టివి ఎన్‌రెడ్డి, వల్లపురెడ్డి, లోక్యనాయక్, కౌన్సిలర్ రుప్లా, రమేష్, మోహన్‌కృష్ణ, అభిషేక్, శంకర్, రవీందర్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ గోదాములను సద్వినియోగం చేసుకోవాలి




**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** రైతులు ప్రభుత్వ గోదాములను సద్వినియోగం చేసుకోవాలని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కో ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ ప్రొగ్రాం డైరెక్టర్ శ్యామ్‌కుమార్ రైతులకు సూచించారు. మంగళవారం నేరేడుచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో అభివృద్ధి సాధికారక సంస్థ ఆధ్వర్యంలో రైతులకు వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోతే ప్రభుత్వ గోదాముల్లో తమ పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునే తగిన ధర లభించినప్పుడే తమ పంట ఉత్పత్తులను విక్రయించుకుని మద్దతు ధర పొందాలని అన్నారు. ఎన్నో ఒడిదిడుకులు ఎదుర్కొని పంటలను పండిస్తే బహిరంగ మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. రైతులు పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయలను వెచ్చించి ప్రభుత్వ గోదాములను నిర్మించిందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్టర్ జె.కమల, కోఆపరేటివ్ బ్యాంకు మేనేజర్ సతీష్, సంఘ చైర్మన్ కొప్పుల రాంరెడ్డి, సంఘ డైరెక్టర్లు సురేష్‌రెడ్డి, శంకరచారి, ఎన్.వెంకటరెడ్డి, కె.శేఖర్‌రెడ్డి, సంఘ సిఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 18 శాఖిల సమన్వయంతో బంగారిగడ్డ గ్రామ ప్రణాళికపై గ్రామసభ

**ప్రజాపక్షం/చండూరు:** నల్లగొండ జిల్లా చండూరు మండలం బంగారిగడ్డ గ్రామ ప్రణాళికపై మంగళవారం గ్రామ సర్పంచ్ బోయపల్లి సునీతశ్రీనివాసులు అధ్యక్షతన గ్రామ సభ సమావేశం నిర్వహించారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు ,ప్రజల అవసరాలను సమగ్రంగా పరిష్కరించేందుకు 18 ప్రభుత్వ శాఖల సమన్వయంతో మండలంలోనే మొదిటి సమావేశాన్ని బంగారిగడ్డలో ఏర్పాటు చేశారు. ఈ గ్రామ సభకు ముఖ్య అతిథిగా ఎంపిడిఓ బండారు యాదగిరి హాజరయ్యారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు ,ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు , మౌళిక వసతుల కల్పన తదితర అంశాలపై సమావేశంలోచర్చించారు. వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై వివరించారు. వాటిపై గ్రామ సభలో గ్రామ ప్రజల సమస్యలను గుర్తించి వాటికి ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చూపేలా సమన్వయలో మందుకు సాగాలని ఈ సందర్భంగా ఎంపిడిఓ యాదగిరి అధికారులకు సూచించారు. గ్రామ సమగ్ర అభివృద్ధికి శాఖలన్ని పరస్పర సహకారంతో పనిచేయాలని ఎంపిడిఓ తెలిపారు. సర్పంచ్ బోయపల్లి సునీతశ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళిక రూపొందించి అందరి భాగస్వామ్యంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో మందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని అన్నారు.ఈ సమావేశంలో ఇన్‌చార్జీ ఎంపిఓ , గ్రామ పంచాయితీ కార్యదర్శి ఏరుకొండ కోటయ్య , ఉపసర్పంచ్ మహ్మద్ మహబూబ్ , ఎఎంసి డైరెక్టర్ తలారి నర్సింహ్మా, ఏఓ మల్లేశం , ఏపిఓ శ్రీను, ఎంఈఓ సుధాకర్ రెడ్డి, వివిధ ఖాఖల అధికారులు పాలొన్నారు.






## పల్లా నర్సింహారెడ్డిని పరామర్శించిన సిపిఐ నాయకులు

**ప్రజాపక్షం/డిండి;** దేవరకొండ మండలం పడమటిపల్లి గ్రామం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ పల్లా నర్సింహారెడ్డి పరామర్శించి ఇటీవల మరణించిన వారి కుమారుడు కామ్రేడ్ పల్లా సుధీర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి సిపిఐ డిండి మండల కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మైనోద్దీన్, సిపిఐ డిండి మండల కార్యదర్శి కనకాచారి, సహాయ కార్యదర్శులు విజేందర్‌రెడ్డి, శైలేష్, కార్యవర్గ సభ్యులు శ్రీనయ్య, రవీందర్‌శర్మ, కేశవులు, హుస్సేన్, వెంకటేశ్వర్లు, నవీన్, ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు వినయ్, సిపిఐ తవక్లాపూర్ గ్రామ శాఖ కార్యదర్శి చక్రి తదితరులు ఉన్నారు.

## విఘ్నేశ్వరునికి చిరుమర్తి పూజలు



**ప్రజాపక్షం/నకిరేకల్ :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నకిరేకల్ పట్టణ కేంద్రంలో నిర్వహించిన విఘ్నేశ్వరుడి తొలి రోజు పూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. పూజా కార్యక్రమానికి నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో నకిరేకల్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో,సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో నకిరేకల్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్ గౌడ్,స్థానిక నాయకులు,మహిళా భక్తులు పాల్గొన్నారు.

## కరపత్రం ఆవిష్కరణ



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి కమ్యూనిస్టులే అసలైన వారసులని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి.పాషా, గోశిక కరుణాకర్‌లు అన్నారు.తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల సందర్భంగా రూపొందించిన కరపత్రాన్ని మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి,భుక్తి కోసం జరిగిన సాయుధ పోరాటం నడిపి లక్షల ఎకరాల భూమి పంచిన చరిత్ర కమ్యూనిస్టులే దక్కిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బండారు నర్సింహ్మా,బత్తుల దాసు,ఆకుల ధర్మయ్య, ఎండి. రేష్మా,బొడ్డు రాజు,బావండ్లపల్లి స్వామి,చికూరి ఈదయ్య, మొగుదాల రాములు,చంద్రయ్య,శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణ స్పోర్ట్స్ క్యాంప్



**ప్రజాపక్షం/చింతలపాలెం :** చిన్న వయస్సు నుంచి శిక్షణ ద్వారా క్రీడల్లో రాణించవచ్చని సర్పంచ్ చెన్నకేసి వెంకయ్య అన్నారు. మండలంలోని దొండ పాడు గ్రామంలో ఉచిత శిక్షణ స్పోర్ట్స్ క్యాంప్‌ను ఆయన ఆధ్వ ర్యంలో ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని స ద్వినియోగం చేసుకొని గ్రామానికి, మండలానికే కాకుండా దేశా నికే పేరు తెచ్చే విధంగా రాణించాలని కోరారు. దాతలు ఉప సర్పంచ్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రేళ్ళ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జగన్మోహన్ రెడ్డి, మెట్టు వెంకటరామిరెడ్డి, దొంగల వీరబాబు, బడుగుల శ్రీను, గ్రామ ప్రజల సహాయ సహకారాలతో క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు.



## ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

**ప్రజా పక్షం/బొమ్మలరామారం :** మండలంలోని రంగాపురం మండల కేంద్రానికి సంబంధించి భూమి సర్వే నెంబర్ 78, 76, 142, 143 సర్వేనంబర్‌లో గల 14 ఎకరాల 36 గుంటల భూమి మీద వస్తున్న ఆరోపణలలో ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు ఎలాంటి సంబంధం లేదని పట్టాదారుడు శశికాంత్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన వారసత్వంగా తన తండ్రి పేరు నుండి వచ్చిన ఆస్తిని తను ఎవరి బెదిరింపులు లేకుండా మార్కెట్ వాల్యూ ప్రకారమే తన భూమిని అమ్ము భూమిని తురకపల్లి మండల వాస్తవ్యులు చాడ భాస్కర్ రెడ్డి, శంకర్ నాయక్, రాజారాం నాయకులకు, విక్రయించాలని ఆయన అన్నారు.

## ఉచిత వైద్య శిబిరం




**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** మండలంలోని కుంట్లగూడెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో దివిస్ పరిశ్రమ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.వైద్యులు డాక్టర్ జయంత్‌కుమార్ పాఠశాలలోని 140మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు,ఎల్‌వి ప్రసాద్ ఆసుపత్రి సిబ్బంది కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థులకు ఉచితంగా రూ.99,248 విలువైన 2527 నోట్ బుక్‌లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భవాని, దివిస్ ప్రతినిధులు బి.గోపి,జి.వెంకటేశ్వర్లు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వరిధాన్యం బహిరంగ వేలం

**ప్రజాపక్షం/డిండి:** విత్తనోత్పత్తి క్షేత్రంలో 308.30 క్వింటాళ్ల నాన్‌సీడ్ వరి ధాన్యాన్ని బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు అధికారులు తెలిపారు.కెఎన్ఎం 1638 రకానికి చెందిన ఈ ధాన్యం వేలం ఈ నెల 17న గురువారం ఉదయం 11 గంటలకు డిండి విత్తనోత్పత్తి క్షేత్రంలో నిర్వహించనున్నారు.వేలంలో పాల్గొనేవారు రూ.10,000 ధరావత్తు (ఈఎండి) చెల్లించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు తెలిపారు.

## విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని హుజూర్‌నగర్ బిఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు పిల్లుట్ల రఘు అన్నారు. మంగళవారం పట్టణంలోని 6వ వార్డు ఇన్‌ఛార్జి లక్క వెంకన్న ఆధ్వర్యంలో ముదిరాజ్ బజార్‌లో ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందీప్ ఆధ్వర్యంలో రఘుకు ప్రత్యేక పూజలు జరిపించి ఘనంగా సన్మానించారు.



# గిరిజనులకు రాజ్యాధికారం కెసిఆర్‌తోనే సాధ్యమైంది

మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** గిరిజనులకు రాజ్యాధికారం కెసిఆర్‌తోనే సాధ్యమైందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సూర్యాపేట నియోజక వర్గం గిరిజన నేతలతో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసి ఈనెల 17న అన్ని తండాల్లో జరుపుకునే సంబరాలపై దిశానిర్దేశం చేశారు. తండాలను గ్రామ పంచాయితీలుగా చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. గిరిజనులకు రిజర్వేషన్ 6 శాతం నుండి 10 శాతం పెంచి వారి జీవితాల్లో వెలుగులు నింపారని తెలిపారు. అందుకు 2022 లోనే కెసిఆర్ శ్రీకారం చుట్టిన సెప్టెంబర్ 17 గిరిజనులకు పండుగ రోజు అన్నారు. ఆ రోజున అన్ని తండాల్లో సంబరాలు అంబరాన్నంటాలని పిలుపునిచ్చారు. ఎంతో మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించిన గిరిజన గురుకులాలు కండ్లముందే కనబడుతున్నాయని గుర్తు చేశారు. గిరిజనుల అభివృద్ధి. ఎస్‌టి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌కు చట్టబద్ధత కల్పించిన ఘనత కూడా కెసిఆర్‌దే అన్నారు. కాంగ్రెస్ ఎస్‌సి, ఎస్‌టి డిక్లరేషన్ పేరుతో మభ్య పెట్టి గిరిజనులను మోసం చేసిందని విమర్శించారు. ఎస్‌టిలకు మూడు కార్పోరేషన్‌లు ఏర్పాటు చేసి ఏడాదికి రూ.500కోట్లు ఇస్తామన్న కాంగ్రెస్ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అన్ని రంగాలతో పాటు గిరిజనులను కూడా తీవ్ర మోసం చేసిందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, సూర్యాపేట, చివ్వెంల మాజీ జడ్‌పిటిసిలు జిడి బిక్షం, భూక్య సంజీవ్ నాయక్, పెన్‌పహాడ్ మాజీ ఎంపిపి నెమ్మాది బిక్షం, మాజీ కౌన్సిలర్ ఎస్‌కె భాషామియా పాల్గొన్నారు.

# పేదల వైద్యానికి సిఎం సహాయ నిధి అండ



**ప్రజాపక్షం/చౌటుప్పల్:** ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సిఎం సహాయ నిధి అండగా ఉంటుందని యాదాద్రిభువనగిరి కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పబ్బు రాజుగౌడ్ అన్నారు.చౌటుప్పల్ మండలం,మునిసిపాలిటీ పరిధిలోని 48మంది లబ్ధిదారులకు మంగళవారం లక్కారంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందని తెలిపారు. అదేవిధంగా మునిసిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావనిరమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అన్నారు.ప్రజలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి,మండల అధ్యక్షులు బోయ దేవేందర్,మునిసిపల్ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి,నాయకులు సుర్వి నర్సింహ్మా,బక్క శ్రీనాథ్,చింతల సాయిలు,శామకూరి యాదయ్య, బండమీది వెంకటేష్,బండమీది మల్లేష్,పర్నె శివారెడ్డి,దేపరాజు,సత్తయ్య,స్వామి పాల్గొన్నారు.

# వాడవాడలా కొలువుదీరిన బొజ్జ గణపయ్య..





**ప్రజాపక్షం/నల్లగొండటౌన్ :** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం వినాయక మండపాలను ప్రత్యేకంగా అలంకరించి,మేళతాళాల నడుమ గణనాథుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గణపతి హోమం, హారతులు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు మండపాలకు చేరుకుని గణనాథుడిని దర్శించుకున్నారు. పలుచోట్ల ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళ భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో మండపాల వద్ద సందడి నెలకొంది.పట్టణంలోని పానగల్ రోడ్డులోని శ్రీనగర్ కాలనీలో శ్రీ విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో 33వ సంవత్సర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ ఏడాది 24 అడుగుల బ్రహ్మముఖ భారీ గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.కార్యక్రమానికి మేయర్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.మున్సిపాలిటీ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించగా,47వ డివిజన్‌లో కార్పొరేటర్ అబ్బగోని కవిత రమేష్ ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమాల్లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు,మునాస నాగరాజు,మునాస ప్రసన్న కుమార్,చెన్నూరు,భరద్వాజ,మునాస వినయ్ కుమార్,కొప్పు అరుణ్,వడ్డెబోయిన సైదులు,జనలీల కోటి,వేణు,మహేష్,చొక్కారపు కోటేశ్వరరావు,దైద శ్రీనివాసరెడ్డి,కార్పొరేటర్ గోగుల గణేష్,అనిల్,సాయికిరణ్, తదితరులు తదితరులు పాల్గొన్నారు.



## ఎల్లంకి శ్రీనివాస్ ఆశయాలు కొనసాగిద్దాం

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** సంస్థాన్ నారాయణపురం మండలంలోని అల్లందేవి చెరువు గ్రామంలో మాజీ ఎంపీపీ కామ్రేడ్ ఎల్లంకి శ్రీనివాస్ 11వ వర్ధంతిని ఆయన స్థూపం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య మాట్లాడుతూ ఎల్లంకి శ్రీనివాస్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం, పేదల సంక్షేమం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలు కొనసాగించి ముందుకు తీసుకువెళ్లడం ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. సర్వేల్, మల్లారెడ్డిగూడెం, గుజ్జ, రాజన్న బావి, గొల్లగూడెం, లింగం వారి గూడెం గ్రామాలలో రైతులు, కూలీలతో గీత కార్మికులతో మమేకమైన సుపరిచితుడు శ్రీనివాస్ అని గుర్తు చేశారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా వెంటనే స్పందించే భావం కలిగిన గొప్ప నాయకుడని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కలకొండ సంజీవ, గీత పనివారల సంఘం నాయకుడు పందుల యాదగిరి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుర్వి నరసింహ, పల్లె మల్లారెడ్డి, వీరమల్ల యాదయ్య, సర్పంచ్ ముత్యాల అంజయ్య, నాయకులు లాలూనాయక్, పల్లె గోపాల్ రెడ్డి, ఇద్దయ్య, భీమనపల్లి గాలయ్య, పల్లె రాములు, గుండు నరసింహ, ప్రజాసంఘాల నాయకులు, శ్రీనివాస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## భూసేకరణ చెల్లింపులు వేగవంతం చేయాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/నల్లగొండటౌన్ :** జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల కింద భూసేకరణ చెల్లింపులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ,నీటిపారుదల ఇంజనీరింగ్ అధికారులు,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లతో భూసేకరణపై వారపు సమీక్ష నిర్వహించారు.డిండి,చింతపల్లి,పెండ్లిపాకల,శివన్నగూడెం తదితర రిజర్వాయర్ల కింద భూములు కోల్పోయిన రైతులకు చెల్లింపుల కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, పెండింగ్‌లో ఉన్న చెల్లింపులన్నీ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన చోట జిల్లా స్థాయి సంప్రదింపుల సమావేశం నిర్వహించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పుడు చెల్లింపులు జరగకూడదని హెచ్చరించారు.భూసేకరణకు సంబంధించి అవార్డు, అలైన్‌మెంట్, మ్యాప్, జియో కోఆర్డినేట్స్‌తో సహా పూర్తి ఫైల్ నిర్వహించాలని ఇంజనీరింగ్ అధికారులు,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను ఆదేశించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్ థియాన్ మావి,డిఆర్‌ఓ దశరథ,ప్రాజెక్టుల ఇంజనీరింగ్ అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

## నేడు మండల స్థాయి సమావేశం

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నేడు ఉదయం 11 గంటలకు ఎంపిడివో అధ్యక్షతన మండల స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడివో సోమసుందర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో విబిజిరాంజీ జలసిరి పనులు, చేయూత పెన్షన్లు, ఇందిరమ్మ ఇండ్లు తదితర అంశాలపై సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు హాజరుకావాలని తెలిపారు.